నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, సోమవారం 13 మే 2024 RANGAREDDY



మేరీ నాట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్, ఎన్నికల అధికారి నారాయణరెడ్డి

## చేవెళ్లలో.. ఆశీర్వాదం ఎవరికో ?

రాష్ట్ర ఏర్పాటు తర్వాత వరుసగా రెండుసార్లు బీఆర్ఎస్ విజయం



గెలుపు కోసం పరితపిస్తున్న కాంగ్రెస్, బీజేపీలు

అసెంబ్లీ బలం.. బీఆర్ఎస్‌లో చెక్కుచెదరని సంకల్పం

బీఆర్ఎస్‌కు వచ్చిన ఓట్లు 7,07,456.. కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కు 97వేల పైచిలుకు మెజార్టీ ఓట్లు

హ్యాట్రిక్ కొట్టేందుకు బీఆర్ఎస్ విశ్వ ప్రయత్నం

రంగారెడ్డి, మే 12 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం.. అనేక విశిష్టతలు కలిగిన ప్రాంతం. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజల మేళవింపు కలిగిన ఈ నియోజకవర్గంలో స్వరాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి బీఆర్ఎస్ పార్టీయే గెలుస్తూ వస్తున్నది. ఇక్కడి ఓటర్లు 2014, 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకే పట్టం కట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీలు తలపడుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాసాని జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ నుంచి గడ్డం రంజిత్‌రెడ్డి, బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలు పోటీ పడుతున్నారు. హ్యాట్రిక్ కోసం బీఆర్ఎస్ విశ్వ ప్రయత్నం చేస్తుండగా.. కాంగ్రెస్, బీజేపీలు పట్టుకోసం పరితపిస్తున్నాయి. ఎవరికి వారుగా అభ్యర్థులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచిన సీట్లు, వచ్చిన ఓట్లే విజయానికి బాట వేస్తాయని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. బీఆర్ఎస్‌కు చేవెళ్ల లోక్‌సభ పరిధిలో 7.07లక్షల ఓట్లు రావడం.. కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కు 97వేల పైచిలుకు ఓట్లు ఎక్కువగా వచ్చాయి. లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో 4 సెగ్మెంట్లలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. బలాబలాల దృష్ట్యా తాజా ఎన్నికల్లో విజయంపై బీఆర్ఎస్ పార్టీ ధీమా పెట్టుకున్నది.

### అదే జోరు సాగేనా..!

తెలంగాణ ఆవిర్భవించిన నాటి నుంచి చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో బీఆర్ఎస్ బలంగా ఉన్నది. 2014, 2019 పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే గెలుస్తుండడంతో చేవెళ్ల గడ్డ బీఆర్ఎస్ అడ్డాగా మారింది. అసెంబ్లీ ఫలితాల్లో ఇతర ప్రాంతాలకు భిన్నంగా ప్రజలు తీర్పునిచ్చి లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పక్షానే నిలిచారు. ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. చేవెళ్ల, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీల్లో బీఆర్ఎస్‌కు 7,07,456 ఓట్లు రాగా.. కాంగ్రెస్‌కు 6,09,522 ఓట్లు, బీజేపీకి 3,35,504 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ పార్టీకి 97వేల పైచిలుకు ఓట్లు అధికంగా వచ్చాయి. దీంతో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజల నుంచి ఇదే ఆదరణ లభించనున్నదని బీఆర్ఎస్ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### ఎవరికి కలిసొచ్చేనో..!

చేవెళ్ల లోక్‌సభలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యే త్రిముఖ పోటీ ఉన్నది. మొదటి నుంచీ ఇక్కడి ఓటర్లు విచక్షణతో తీర్పునిస్తూ వస్తున్నారు. 2014లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచి గెలుపొందారు. గెలిచాక పార్టీ ఫిరాయించారు. 2019లో కాంగ్రెస్ తరఫున పోటీ చేయగా బీఆర్ఎస్ అభ్యర్థి చేతిలో కొండా ఓటమి పాలయ్యారు. 2019లో గడ్డం రంజిత్‌రెడ్డిని బీఆర్ఎస్ పోటీలో నిలబెట్టగా.. చేవెళ్ల నియోజకవర్గ ప్రజానీకం ఆయన్ని గెలిపించి గులాబీ జెండాను రెపరెపలాడించింది. రంజిత్ రెడ్డి సైతం బీఆర్ఎస్‌ను వీడి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో ఉన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా ఈసారి ఎన్నికల్లోనూ ఫిరాయింపుదారులకు గుణపాఠం తప్పదా! అన్న టాక్ వినిపిస్తున్నది. బీఆర్ఎస్ అభ్యర్థి బీసీ సామాజిక వర్గానికి చెందినవారు కావడం.. మిగతా ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు జనరల్ కేటగిరీకి చెందినవారు కావడం కూడా బీఆర్ఎస్‌కు కలిసొచ్చే అంశమని వివిధ వర్గాలు పేర్కొంటున్నాయి.

**నియోజకవర్గంలో ఓటర్లు..**

| | | |
|---|---|---|
| పురుషులు | : | 15,04,260 మంది |
| స్త్రీలు | : | 14,33,830 మంది |
| ఇతరులు | : | 280 |
| మొత్తం | : | 29,38,370 మంది |

**లోక్‌సభ స్థానం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లు..**

శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు

**2014 లోక్‌సభ ఎన్నిక ఫలితం ఇలా..**

| పార్టీ | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|
| బీఆర్ఎస్ | 4,35,077 | 33.1 |
| కాంగ్రెస్ | 3,62,054 | 27.8 |
| టీడీపీ కూటమి | 3,53,203 | 26.8 |
| పోలైన ఓట్లు | 13,22,312 | 60.51 |

**2019 లోక్‌సభ ఎన్నిక ఫలితం ఇలా..**

| పార్టీ | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|
| బీఆర్ఎస్ | 5,28,148 | 40.62 |
| కాంగ్రెస్ | 5,13,831 | 39.5 |
| బీజేపీ | 2,01,960 | 15.53 |
| పోలైన ఓట్లు | 13,00,998 | 53.25 |


## స్ట్రాంగ్ రూంకు పోస్టల్ బ్యాలెట్లు

కట్టుదిట్టమైన భద్రత నడుమ చేవెళ్లలోని శ్రీ బండారి శ్రీనివాస్ ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ హాల్‌కు తరలింపు

షాబాద్, మే 12: చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను కట్టుదిట్టమైన భద్రత నడుమ ఓట్ల లెక్కింపు కేంద్రమైన చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని శ్రీ బండారి శ్రీనివాస్ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంకు ఆదివారం తరలించారు. రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక స్వీయ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ కొనసాగింది. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వచ్చిన పోస్టల్ బ్యాలెట్లను ముందుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపర్చగా, వాటిని పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ప్రత్యేక కంటైనర్ వాహనంలో ఆదివారం కౌంటింగ్ సెంటర్ స్ట్రాంగ్ రూంకు చేర్చారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్‌కుమార్ కటారియాతో పాటు జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, చేవెళ్ల ఆర్డీవో/ఏఆర్వో సాయిరాం, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తరఫున వారి ఏజెంట్ల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్లను జాగ్రత్తగా భద్రపర్చి, స్ట్రాంగ్ రూంకు సీల్ వేశారు.



పోస్టల్ బ్యాలెట్లను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి సీల్ వేసేందుకు వస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక, అధికారులు



చేవెళ్లలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రిని తీసుకుంటున్న సిబ్బంది

# ఓటేద్దాం రండి..

## నేడే పోలింగ్..

**లోక్‌సభ నియోజకవర్గం : చేవెళ్ల**

| | | |
|---|---|---|
| అసెంబ్లీ సెగ్మెంట్లు | : | 07 |
| బరిలో ఉన్న అభ్యర్థులు | : | 43 మంది |
| మొత్తం ఓటర్లు | : | 29,38,370 మంది |
| పురుషులు | : | 15,04,260 మంది, స్త్రీలు : 14,33,830, ఇతరులు : 280 మంది |
| పోలింగ్ కేంద్రాలు | : | 2,877 |
| ఎన్నికల సిబ్బంది | : | 13,443 మంది |
| కంట్రోల్ యూనిట్లు | : | 3,591 |
| బ్యాలెట్ యూనిట్లు | : | 10,757 |
| వీవీప్యాట్లు | : | 4,008 |
| మైక్రో అబ్జర్వర్లు | : | 216 మంది |

### చేవెళ్ల లోక్‌సభ బరిలో 43 మంది..

అభ్యర్థుల భవితను తేల్చనున్న 29,38,370 మంది ఓటర్లు

2,877 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఎన్నికల విధుల్లో 13,443 మంది సిబ్బంది

ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా ఎన్నికల యంత్రాంగం

రంగారెడ్డి, మే 12 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 43 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. 29,38,370 మంది ఓటర్లు వారి భవితవ్యాన్ని తేల్చనున్నారు. ఓటింగ్‌కోసం మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశా రు.ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగనున్నది. 13, 443 మంది ఎన్నికల సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. 3,591 కంట్రోల్ యూ నిట్లు, 10,757 బ్యాలెట్ యూనిట్లు, 4,008 వీవీ ప్యాట్లను వినియోగిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో మొత్తం ఓటర్లు



9,83,191 మంది ఉండగా.. అందులో పురు షులు 4,85,210 మంది, మహిళలు 4,97,946 మంది, ఇతరులు 35 మంది ఉన్నారు. కొడంగల్ సెగ్మెంట్‌లో మొత్తం ఓటర్లు 2,41,794 మంది ఉండగా.. అందులో పురుషులు 1,18,856 మంది, మహిళలు 1,22,933 మంది , ఇతరులు ఐదుగురున్నారు. మరోవైపు జిల్లాలో 7248 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల య్యాయి. జిల్లావ్యాప్తంగా 1434 బ్యాలెట్ యూనిట్లు 1434 కంట్రోల్ యూనిట్లు, 1605 వీవీప్యాట్‌లను సిద్ధంగా ఉంచారు. 1148 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో 303 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నట్లు అధికారులు గుర్తిం చారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఐదు పోలింగ్ కేంద్రాలను మహిళా ఓటర్లకు, ఐదు మాడల్ పోలింగ్ కేంద్రాలను దివ్యాంగులకు, యువతకు ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా ఎన్నికల యంత్రాంగం ఏర్పాటు చేసింది.

### పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సామగ్రి..

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో అధికారులు ఏడుచోట్ల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఎన్నికల సిబ్బంది సామగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో తరలివెళ్లారు. సోమవారం ఉదయం 5.30 గంట లకే మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. మాక్ పోలింగ్ అనంతరం ఏడు గంటలకు సాధా రణ పోలింగ్ ప్రక్రియ మొదలుకానున్నది. లోక్‌సభ పరిధిలో 2,877 పోలింగ్ కేం ద్రాలను ఏర్పాటు చేయగా.. దివ్యాంగులు, మహిళలు, యువత కోసం మాడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల సంఖ్య కంటే 25 శాతం అదనంగా(రిజర్వు) బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను అందుబాటులో ఉంచుతున్నా రు. మైక్రోఅబ్జర్వర్లు 216 మంది, పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు కలుపుకొని 13,443 మందికి పోలింగ్ విధుల కోసం ర్యాండమైజేషన్ ద్వారా బాధ్యతలు కేటాయించారు. 20 శాతం మంది రిజర్వుడు సిబ్బందిని సైతం అందుబాటులో ఉంచారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా, సీసీ కెమెరాల ద్వారా ఎన్నికల ప్రక్రియను ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరు ఐడీ లేకుంటే ఇతర 12 రకాల ఐడీ కార్డులకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది.

**పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి..**

చేవెళ్ల లోక్‌సభ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టాం. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి. ఓటేసేందు కు వెళ్లేవారు ఓటరు కార్డు లేదా ఎన్నికల సంఘం గుర్తించిన ఏదో ఒక గుర్తింపు కా ర్డును వెంట తీసుకెళ్లాలి. దివ్యాంగులు, మహిళలు, యువతకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశాం.

– నారాయణ రెడ్డి, వికారాబాద్ కలెక్టర్, ఎన్నికల అధికారి

**కేంద్రానికి ఐదుగురు సిబ్బంది..**

ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్(పీవో), ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్(ఏపీవో), ముగ్గురు సహాయక ప్రిసైడింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించను న్నారు. ఈ లెక్కన మొత్తం 13,443 మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొను న్నారు. అదనంగా మరో 20 శాతం సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుతున్నారు. పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ కోసం 256 మంది సెక్టోరియల్ అధికారులను నియమించారు. ఇంకా కొంతమందిని ఎన్నికల విధులకు వినియోగించుకుంటున్నారు.

**ఎన్నికల సిబ్బంది వివరాలు..**

| నియోజకవర్గం | పీవో | ఏపీవో | ఓపీవో | మొత్తం |
|---|---|---|---|---|
| మహేశ్వరం | 644 | 644 | 1,288 | 2,576 |
| రాజేంద్ర నగర్ | 651 | 651 | 1,302 | 2,604 |
| శేరిలింగంపల్లి | 759 | 759 | 1,518 | 3,036 |
| చేవెళ్ల | 357 | 357 | 714 | 1,071 |
| పరిగి | 283 | 283 | 566 | 1,132 |
| వికారాబాద్ | 341 | 341 | 682 | 1,132 |
| తాండూరు | 332 | 332 | 664 | 1,132 |

**చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఓటర్ల వివరాలు..**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| మహేశ్వరం | 2,85,137 | 2,71,538 | 66 | 5,56,741 |
| రాజేంద్రనగర్ | 3,16,979 | 2,95,153 | 38 | 6,12,170 |
| శేరిలింగంపల్లి | 4,00,361 | 3,57,600 | 141 | 7,58,102 |
| చేవెళ్ల | 1,35,429 | 1,34,526 | 05 | 2,69,960 |
| పరిగి | 1,33,568 | 1,32,989 | 09 | 2,66,566 |
| వికారాబాద్ | 1,14,965 | 1,16,660 | 14 | 2,31,639 |
| తాండూరు | 1,17,821 | 1,25,364 | 07 | 2,43,192 |
| మొత్తం | 15,04,260 | 14,33,830 | 280 | 29,38,370 |



పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న ఎన్నికల సిబ్బంది



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శిక్షణలో పాల్గొన్న పోలీసులు

## భారీ భద్రత..

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ఐదంచెల పటిష్ట బందోబస్తు

ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఉమ్మడి జిల్లాలో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లాలో రెండు వేల మంది పోలీసులు విధులు నిర్వహిస్తుండగా, వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు సెగ్మెంట్లతోపాటు మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కొడంగల్ సెగ్మెంట్‌లో జిల్లా పోలీస్ సిబ్బంది, కేంద్ర పారామిలిటరీ బలగాలు, కర్ణాటక రాష్ట్ర పోలీసులతోపాటు శిక్షణలో ఉన్న పోలీసులు మొత్తం రెండువేల మంది ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఇందులో 45 కంపెనీల కేంద్ర బలగాలు, 14 కంపెనీల టీఎస్ఎస్‌పీ బలగాలు, 750 మంది కర్ణాటక పోలీసులు, 260 మంది శిక్షణ పోలీసు అధికారులు, అదేవిధంగా జిల్లాకు చెందిన 800 మంది పోలీస్ అధికారులతోపాటు సిబ్బందితో భద్రతను కట్టుదిట్టం చేశారు. అంతేకాకుండా అత్యవసర సమయాల్లో స్పందించేందుకు 19 స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, 4 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా, మిగతా పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పటిష్ట నిఘాను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉండనున్నది. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా పోలీస్ శాఖ ఐదంచెల పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసింది.